


"యస్ ప్లీజ్?"

తన కెదురుగా కుర్చీమీద కుదురుగా కూర్చొనున్న సుగంధిని అడిగాడాయన చిరునవ్వుతో.

ఆయన వయసు ఏభై దాటాయి. ఉత్తర భారతీయుడని తెలుస్తోంది.

"ప్రయివేట్ అఫైర్స్ మీరు పరిశోధిస్తారా?" అడిగింది సుగంధి.

"బయట ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అండ్ డిటెక్టివ్ ఏజన్సీ అన్న బోర్డ్ చూడగానే చాలామందికి ఇలాంటి అనుమానమే వస్తుంది. వ్యక్తిగత విషయాల్లో కూడా మేం పరిశోధన చేస్తాం. దేని గురించి?"

సుగంధి కాస్సేపు మౌనంగా వుండిపోయింది. ఛీఫ్ డిటెక్టివ్ బెల్ నొక్కాడు. ప్యూన్ రాగానే ఏదో సౌంజ్ఞ చేశాడు. అతను వెళ్ళాక ఆయన ముందుకు వంగి అడిగాడు.

"చెప్పండి. మీరు చెప్పేదంతా రహస్యంగా వుంచబడుతుంది."

"మీరు ఓ సంగతి నాకు రుజువులతో సేకరించి పెట్టాలి?" అడిగింది సుగంధి.

"ష్యూర్...."

"నా భర్తకి ఓ ప్రియురాలుంది. ప్రతీ బుధవారం రాత్రి ఇద్దరూ కలిసే గడుపుతారు. మీరా సంగతి రుజువులతోసహా నాకు సంపాదించి పెట్టాలి."

"మీ భర్త పేరు?"

చెప్పింది.

"ఏం చేస్తుంటారు?"

"ఐరన్ ఫౌండ్రీ వుంది.... ఫేక్టరీ సనత్ నగర్‌లో."

"ఆమె...."

"నా భర్త దగ్గర పి. ఏ.గా పని చేస్తోంది. పేరు మేరీనా. ఆంగ్లో ఇండియన్."

"మీ కెలా అనుమానం కలిగింది?"

"ఆయనే చెప్పారు నెలక్రితం.... ఓ బుధవారం రాత్రి ఎప్పటిలా ఆలస్యంగా ఇంటికి వచ్చారు. పెర్ఫ్యూమ్ వాసనవేసింది. అది మేరీనా వాడేది. అడిగితే నిర్భయంగా నిజం వప్పుకున్నారు."

"వాళ్ళు బుధవారం రాత్రికాక మరెప్పుడయినా కలుసుకుంటారా?"

"ఉహుఁ. ఆ ఒక్క రాత్రి మాత్రమే...."

"కారణం?"

కొద్దిగా తడబడి చెప్పింది-

"నాకు తెలియదు."

"ఎక్కడ కలుసుకుంటారు?"

"ఆయన ఆఫీసు గదిలోనే. రాత్రి మేరీనాని ఆమె ఇంటి దగ్గర దింపి అర్ధరాత్రి దాటాక వస్తారు."

"ఎంతకాలం నించి?"

"రెండు నెలలనించి."

"ఆ సాక్ష్యాలతో ఏం చేయదలచుకున్నారు?"

"విడాకులకోసం. అప్పుడే ఆలస్యంకాకుండా విడాకు లొస్తాయి. ఐ హేట్ హిమ్!"

"సారీ! కొంతమంది మొగా ళ్ళంతే!" అనునయంగా చెప్పా డాయన.

"కోర్టుకి వచ్చి సాక్ష్యం ఇవ్వాల్సిన పక్షంలో మీరు కోర్టుకి హాజ రవ్వాలి."

"ష్యూర్. అంతేకాదు, కోర్టు నమ్మ దగ్గసాక్ష్యాలు సేకరించగలనుకూడా" కాసేపు సుగంధి వంక చూసాడు. మెప్పైన రెండేళ్ళు. కళ్ళలో, మొహంలో కొట్టొచ్చినట్లు కనబడు తుంది రోషం, భర్త మీద ద్వేషం. "మీరు అన్ని విషయాలు ఆలోచిం చుకుని ఈ నిర్ణయం తీసుకోవాలో, వద్దో నిశ్చయించుకోడానికి కొద్ది రోజులు ఆగితే మంచిదనిపిస్తోంది." తల ఎగరేసి నిర్లక్ష్యంగా చెప్పింది. "నాకు సాక్ష్యాలు కావాలి."

"గుడ్. సాధారణంగా భార్యా భర్తలు విడిపోవడం ఎవరికీ మన స్కరించదు... కాని ఇలాంటి పరి స్థితుల్లో అయితే తప్పనిసరి." "థాంక్స్- నన్నర్థం చేసుకున్నం దుకు."

"మీరు కూడా మాతో కొంత సహ కరించాలి."

"బై ఆల్ మీన్స్."
"వాళ్ళిద్దరు కలిసేది ఆయన ఆఫీస్ గదిలోనే అని స్పష్టంగా తెలుసా?"
"నూటికి నూరుపాళ్ళు."
"నే నడిగే ప్రశ్నలకి...."

తలుపు తీసుకుని ప్యూన్ చేత్తో ట్రేతో రావడంతో, ప్యూన్ కూల్ డ్రింక్స్ గ్లాసులు టేబిల్‌మీద వుంచి వెళ్ళేదాకా మౌనంగా వుండి పోయాడు. అది ఆయన పద్ధ తని గ్రహించింది సుగంధి.

సుగంధి భర్త కారు నెంబరు, ఇంటి నించి బయలుదేరే సమయం, తిరిగి వచ్చే సమయం, ఎలా వుంటాడో మొదలయిన వివరాలు రాసుకున్నా డాయన.

"ఆయన ఫోటో ఒకటి కావాలి?"
"అడుగుతారు అని తెలుసు. తెచ్చాను." చేతిలోని వేనిటీ బేగ్ తెరచి అందులోంచి ఓ ఛేజ్ పుస్త కం తీసి, దాన్ని తెరచి పాస్‌పోర్ట్ సైజు ఫోటో అందించింది.
"మీ చార్జెస్...."

ప్రింట్ చేసిన ఓ కార్డ్‌ని అందించా డాయన. అందులోని రేట్స్ చదివి తల పంకించి రెండువేల రూపా యలు అడ్వాన్స్‌గా యిచ్చింది.

"మీరు రేపు వుదయం వస్తే ఓ అగ్రిమెంట్ టైప్‌చేసి సిద్ధంగా వుం టుంది. దాని మీద సంతకంచేయాలి.

ఆయన లేనప్పుడు మా డిటెక్టివ్‌ని మీ ఆయన ఆఫీస్ గదిలోకి తీసుకెళ్ళాలి. మొత్తం ఓ ముప్పావు గంట పని- ఎలక్ట్రానిక్ కెమేరా- ఇతర పరికరాలు పనిచేస్తున్నాయని రూఢీ అయాక, బుధవారం రాత్రి దాకా ఆగాలి మీరు. గురువారం మధ్యాహ్నం వస్తే బేలన్స్ ఇచ్చి ఫోటోలు, కేసెట్ తీసుకెళ్ళొచ్చు."

"థాంక్స్. కాని ఈ సంగతి నా భర్తకి ముందే తెలిసిపోతే...."

"మీరు ఇక్కడికి వచ్చి వెళ్ళినట్లు ఎవరితోనూ అనకండి. మా క్లయింట్స్ సంగతులన్నీ అత్యంత రహస్యంగా వుంచబడతాయి. మీరు నిశ్చింతగా వెళ్ళచ్చు."

డిటెక్టివ్- సుగంధిని ఎప్పుడు ఎక్కడ కాంటాక్టు చేయాలో నిర్ణయించాక సుగంధి బయటకి నడిచింది.

రెండు మూడు నిముషాల దాకా ఆయన కుర్చీలో వెనక్కి వాలి ఆలోచిస్తుండిపోయాడు.

తర్వాత స్క్రిబ్లింగ్ పేడ్‌లో ఓ వాక్యం రాసాడు.

'ఆడవాళ్ళ మనసు అర్థం చేసుకోవటం కష్టం.'

* * *

గురువారం మధ్యాహ్నానికల్లా సుగంధికి కావలసిన సాక్ష్యాధారాలు సిద్ధంగా వున్నాయి. సుగంధి రాగానే ఓ బ్రవున్ రంగు కవర్ అందించి చెప్పాడాయన.

"మీక్కావలసినవన్నీ యిందులో వున్నాయి."

సుగంధి కవరు తెరచి చూసింది. ఆ కలర్ ఫోటోలు చూడగానే ఆమెలో కోపం అధికం అయింది.

"డేమ్ దిస్ మేన్!" గొణిగింది.

"రెండు సి-నైన్టి కేసెట్స్. వింటారా?" అడిగాడాయన.

"అవసరంలేదు."

బేలన్స్ చెల్లించి వెళ్ళిపోయింది సుగంధి.

స్క్రిబ్లింగ్ పేడ్‌లో అంతకు మునుపు రాసుకున్న వాక్యాలని చదివి, 'కష్టం' ముందు 'నిజంగా' అనే పదం చేర్చాడు.

ఓ సారి భుజాలెగరేసాడు.

* * *

వారం తర్వాత ఓ రోజు సుగంధి మళ్ళీ ఆ గదిలోకి వచ్చింది. వచ్చి విసురుగా కుర్చీ లాక్కుని కూర్చుంది.

"ఏమిటీ అన్యాయం?" దాదాపుగా అరిచింది వుద్రేకంగా.

"సుందర రిలాక్స్ అవండి."

"యు ఆర్ ఏ చీట్."

"నే నిచ్చిన సాక్ష్యాలు సరయినవి కావా?" అడిగాడాయన పొడిగా.

"ముందే ఎందుకు చెప్పలేదు?"
నిప్పులు కక్కుతూ అడిగింది.
"ఏం చెప్పలేదు? మీకు విడాకులు మంజూరు అయాయనుకుంటా?"
"అయాయి. ఇప్పుడే కోర్టునించి వస్తున్నాను. నేను కాదు విడాకులకు అప్లయిచేసింది, మా ఆయన."
"మీక్కావలసింది విడాకులే అయినప్పుడు ఎవరు అప్లయిచేస్తే ఏం?"
"నువ్వు ముందే ఎందుకు చెప్పలేదు? ఎంత అవమానం నాకు?"
సుగంధికి ఏడుపు, కోపం ఒకేసారి వచ్చాయి.
"నేనేం చెప్పలేదు?"
"నాకు మా పక్కింటి ఇన్సూరెన్స్ ఏజెంట్‌తో సంబంధం వుందన్న సంగతి మీకు తెలుసని, మా ఆయన నాకన్నా ముందే మీ దగ్గరకి వచ్చి ఆ సంగతి నిరూపించడానికి ఆధారాలు అడిగారని, ఇవాళ మీ డిటెక్టివ్ నాకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాడు."
ఆయన తన చేతిలోని పెన్సిల్‌వంక చూస్తూ చెప్పాడు.
"చూడండి...."
"షటప్. యు ఆర్ ఏ స్కౌండ్రల్."
"చూడండి. ఏ క్లయింట్ ఈజ్ ఏ క్లయింట్. ఓ క్లయింట్ రహస్యం మరో క్లయింట్‌కి ఎప్పటికీచెప్పం. మా క్లయింట్‌కి సంబంధించిన అన్ని విషయాలు రహస్యంగా వుంచబడతాయని చెప్తే, రహస్యంగానే వుంచబడ్డాయి. ఆ క్లయింట్స్ ఇద్దరూ భార్యాభర్తలయినాసరే, ఈ నియమం తప్పం."
"యు ఆర్ ఏ డెవిల్."
"ఇంక నా సమయం వృథా చేయకండి!" కఠినంగా చెప్పాడాయన.
గట్టిగా హూంకరించి లేచి నిలబడింది సుగంధి.
"మీ భర్తలాగే మీరూ శీలవంతులు కారు. అలాంటప్పుడు దేనికి ఆయన మీద ఈ కసి?"
జవాబు చెప్పకుండా విసవిస వెళ్ళిపోయింది సుగంధి.
చిన్నగా నవ్వుకువి స్క్రిబ్లింగ్ పేడ్‌లో రాసుకున్నాడాయన ఇది వరకూ రాసుకున్న వాక్యంముందు.
'ఆడది ఆడదే కాబట్టి' *

---

"సార్! మీరు ఎరుపు రంగు చొక్కా లేసుకు వచ్చారా ఏమిటి?" అనడిగాడు మంగలి ఆదుర్దాగా.

గడ్డం చేయించుకుంటున్న వ్యక్తి, "లేదే! ఎందుకడుగుతున్నావ్?" అన్నాడు.

"ఉండండి, ముందు డాక్టర్ని పిలుచుకొస్తాను" అని పరుగెత్తాడు మంగలి. —మాదుమురళి (విజయవాడ)